# బీరకాయపీచు

"ప్రవీణ్... లేనాన్నా!లే! "ఎనిమిద యి పోయింది" అంటున్న మమ్మీ కేక విని బద్ధకంగా వళ్లు విరుచు కున్నాను.

రోజూ పదింటిదాకా పడుకున్నా వూరుకోవడం లేదూ! మరో గంటలో మనం బయల్దేరాలి లే!లే!" అంటూ నారూం కిటికీలు తెరుస్తోంది మమ్మీ.

ఆవిడ మాటలు విననట్టే గట్టిగా కళ్లు మూసుకున్నాను.

"ఇదిగో...ఎన్నిసార్లు లేపాలి?" అంటూ వచ్చి బ్లాంకెట్ లాగేసరికి కళ్లు తెరవక తప్పలేదు.

"ప్లీజ్ మమ్మీ! నేమరాను. అసలు పెళ్లిళ్లూ, పార్టీలంటే నాకు పడదని నీకు తెలీదూ!" అన్నాను.

"పార్వతాంటీ అంతలా వచ్చి పిలిస్తే వెళ్లకపోవడమేమన్నా మర్యాదగా వుంటుందా? ఒక్కగానొక్క కూతురు పెళ్లికి రాలేదని బాధపడుతుందిరా"

నువ్వొక్కదానివే వెళ్లచ్చొగా! అన్నాను

"మీ డాడీ వూళ్లో వుంటే నిన్నింత బతిమాలే అవసరముండేదికాదు. అయినా, ఆడపిల్లలా ఇల్లు కదలనంటావేం? పెళ్లీడుకొచ్చిన కొడుకుని ఇంట్లో వదిలేసి, వచ్చాననుకోరూ!"

"మమ్మీ ప్లీజ్! ఈ ఒక్కసారికి...

"నోప్లీజింగ్! నువ్వు రావట్లేదని మేనేజర్‌కి ఫోన్‌చేసి చెప్పాను." అంటూ నాకు మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అక్కడ్నుంచి వెళ్లిపోయింది మమ్మీ.

ఇష్టం లేకపోయినా లేచి, స్నానంచేసి డ్రస్ చేసుకున్నాను. ఎవరో, బీరకాయ పీచు చుట్టాల పెళ్లికి వెళ్లకపోతే ఏం? అక్కడికెళ్లిన దగ్గర్నుంచీ, మమ్మీ 'నగలు, చీరలు' అనే ప్రపంచంలో పడిపోయి, మధ్యమధ్యలో అందరూ వినేలా

"నాన్నా! కార్లో ఓవల్టీనుంది తాగు. ఫ్లాస్క్‌లో పోసి పెట్టాను." అని, ఓచిన్న కుర్రాడికి చెప్పినట్టు చెప్తుంది.

"సరేలేగాని, నువ్వుమాత్రం, నాన్నా!కన్నా! అదితాగు ఇది తిను, అని చెప్పావంటే క్షణం వుండను." అని స్ట్రిక్ట్‌గా వార్నింగిచ్చాను.

లక్షల ఆస్థికి ఏకైక వారసుడు. అమ్మనాన్నలకి గారాల పుత్రుడని అందరికీ తెలియ పర్చాలని అమ్మ తాపత్రయం.

దాంతో అందరూ తనని ఆశ్చర్యంగా చూడ్డమే కాకుండా,అమ్మ చాటు బిడ్డగా చెప్పుకోవడం తనకి తలతీసేసినంత పనవుతుంది. అందుకే మమ్మీతో కలిసి పార్టీల కెళ్లాలంటే చచ్చేంత భయం తనకి.

"దిగు నాన్నా వచ్చేశాం" మమ్మీ మాటలకి ఈ లోకంలో కొచ్చి కారు దిగాను డ్రైవర్ని పంపేసి..

మేరేజ్‌హాల్లోకి నడుస్తూ మమ్మీ రహస్యంగా

"ఈ పెళ్లిలోనన్నా ఎవరైనా వచ్చిన పిల్ల ఉంటుందేమో చూడు. పెళ్లి చూపులు నీకెటూ పడవుగా!"

"లేకపోతే ఏమిటి? పశువుల సంతలా!" అన్నాను.

"అందుకేగా? నిన్నింత బలవంతపెట్టి తీసుకొచ్చింది? అంది.



**ఝాన్సీరాణి**

అప్పటికే పెళ్లి తంతు మొదలయింది. మమ్మల్ని ఆహ్వానిస్తూనే ఎవరెవరో సాదరంగా ఆహ్వానించి మండపం దగ్గర్లో నున్న కుర్చీల్లో కూర్చోబెట్టారు.

ముత్తయిదువుల మధ్య పెళ్లి కూతురు పెళ్లినడక నడుస్తూ వచ్చింది.

మార్వెలెస్! చాలా అందంగా వుంది. ఆ కళ్లు, ఆముక్కు...ఛ!ఛ! ఏమిటి తను? మమ్మీ

పెళ్ళికాని అమ్మాయిల్ని చూడమంది కదూ!

పెళ్ళికూతురు ఎంత అందంగావుంటే మాత్రం.ఏం లాభం? మరికొన్ని క్షణాల్లో మరొకరికి సొంతమవుతుంది. దీర్ఘంగా నిట్టూరుస్తూ పక్కకి చూశాను. మమ్మీ లేదు. మండపం దగ్గర మరెవర్తోనో మాట్లాడుతూ, తనని వ్రేలితో చూపించింది. వాళ్ల నోళ్లు తెరుచుకొని తనని చూస్తుండేసరికి తక్షణం వెళ్లిపోవాలన్పించింది. కాని అంతలోనే ''నాన్నా!కన్నా!'' అంటూ ఆవిడ వెయ్యబోయేకేకలుగుర్తొచ్చి అలా గే కూర్చుండిపోయాను.

అంతలో ఓమెరుపుతీగ... ఎర్రపట్టు చీర లో పెళ్లికూతురి ఊడిపోయిన డ్రెస్సింగ్ ముక్కు పుడకని సరిచేస్తోంది.

కెమెరాఫ్లేష్‌లనీ , వీడియో కెమెరాని పట్టించు కోకుండా. దాదాపు పెళ్లి కూతుర్లానే వుంది. కాకపోతే మరికాస్త తెల్లగా సన్నగావుంది. పెళ్లికూతురి చెల్లిలేమో!

మాంగల్యధారణ పూర్తయింది. చేతిలోని అక్షింతలు ఆ ఎర్రచీర సుందరి ముఖం మీదికి విసురుగా హుషారుగా జల్లాను.

పాపం.... అక్షింతల్లోని పసుపు కంట్లోపడి నట్టుంది.కన్ను నలుపుకుంటూ వచ్చి నాపక్కనే కూర్చుందామె. ఎగిరి గంతెయ్యాలని పించింది.

గబగబా జేబులోని హేండ్‌కర్చిఫ్ తీసి ఆమె కందించాను. అందుకొని, కన్ను తుడుచు కుంటూ!

''థాంక్స్!''అంది.

''నోమెన్షన్! పాపం...కన్నుబాగా ఎర్ర బడింది'' అన్నాను. పెళ్లిచేసుకునే వాళ్లమీదికి విసరకుండా, నా ముఖం మీదికి.... అందులోనూఅంత విసురుగానా వెయ్యడం?'' అంది.

ఆమె తనని చీవాట్లు వెయ్యడానికే వచ్చిందేమోనని భయం వేసి, తడబాటుగా

''అది...అది..''అన్నాను.

''అందుకే ముహూర్తం టైంకి అక్కడుండ కూడదనుకున్నానండీ! కాని , దానిముక్కుపుడక...''''చూశానండీ! పాపం....అది ఊడి పోతే మీరు మాత్రం ఏం చేస్తారు?'' అన్నాను సానుభూతి కురిపిస్తూ.

ఆమె నాపక్కనే వచ్చి కూర్చుని మాట్లాడ్డం మమ్మీ చూస్తే బావుండునని పందిరి నాలుగువేపులా చూశాను. కాని, ఆవిడ జాడ లేదు.

''ఎవరు కావాలి?'' అడిగిందామె.

''అబ్బే...ఏంలేదు. మీరు పెళ్లికూతు రికి.''

''పిన్ని కూతుర్ని'' అని, కాటుకతో నల్ల బడ్డ నాకర్చిఫ్ అందించింది. దాని వేపోసారి చూసుకొని జేబులో పెట్టుకున్నాను.

పెళ్లి తతంగం పూర్తయింది.

''రాజీ!'' అన్న పిలుపు విని,నాకు మరోసారి థాంక్స్ చెప్పి వెళ్లిపోయింది.

రాజీ అంటే... రాజ్యలక్ష్మి,రాజేశ్వరి.... రాజరాజేశ్వరి.... ఏపేరయుంటుంది? పదినిముషాలపాటు ఆమెతనపక్కనే కూర్చున్నా, పేరడగాలనే ఐడియానే రాలేదు.ఛ ఛ! పోనేలే! ఎలాగూ పరిచయమయ్యింది గనుకుఇంటికెళ్లేలోగా వివరాలు తెలుసుకోవచ్చు.

''ఇంకా అలా కూర్చున్నారేం? భోజనానికి రండి''

రాజీ గొంతువిని, ఆనందంగా ఆమె వెంట నడిచాను. ప్లేట్లో పదార్థాలు వడ్డించి, ''ఇప్పుడే వస్తానంటూ'' వెళ్లిపోయింది రాజీ హడావుడిగా.

కాస్త దూరంలోమమ్మీ కన్పించింది. ఆమె చుట్టూ నలుగురు ఆడవాళ్లు చేరి,ఎంతో శ్రద్ధగా,అంతకు మించిన ఆరాధనగా మమ్మీ రవ్వల నెక్లేసుని పరిశీలిస్తున్నారు.

మమ్మీచూపులు గర్వంగా వున్నాయ్. హఠాత్తుగా నన్ను చూసిన మమ్మీ వాళ్లని వదిలించుకొని కంగారుగా నాదగ్గర కొచ్చి,

''ఏం తింటున్నావ్ నాన్నా !''అంది!

''ఏదో ఒకటి తింటున్నాలే!అన్నానువిసుగ్గా.

''ఆ గుత్తివంకాయ మాత్రం తినకు. దాన్నిండా కొబ్బరి , నువ్వులు. దగ్గొస్తుంది.''

''సరేలే కాస్త మెల్లగా మాట్లాడు.చిన్నపిల్లాడికి చెప్పినట్టు అన్నీ చెప్పాలానాకు? అన్నాను చుట్టు పక్కల వాళ్లు మమ్మల్నే ఆసక్తిగా చూస్తుండేసరికి.

అసలు మమ్మీకి నేను కొడుకునంటే ఏవరూ నమ్మరు. నాపక్కన కాస్త పొట్టిగా సన్నగా, అందంగా ట్రిమ్‌గావున్న మమ్మీని ఏగర్ల్ ఫ్రెండో అనుకుంటారు.

అందులోనూ ఇలాంటి పార్టీలంటే, ఆవిడ వేసుకునే మేకప్ ఆమెని పాతి కేళ్ళ అమ్మాయిని చేస్తుంది .

నాకు,మమ్మీకి కేవలం పదిహేనేళ్లే తేడా. నేను నాన్నగారిలా ఎత్తుగా,కాస్త లావుగా వుండడం వల్ల, మమ్మీతో బయటికెళ్లాలంటే చచ్చేంత సిగ్గుగా వుంటుంది.

పైగా, నాముక్కు వాళ్లనాన్నగారి ముక్కులా వుంటుందని,''నాన్నా!కన్నా!''అని ముద్దుగా పిలుస్తుంది తన కంచు కంఠంతో.

''నాన్నా!నువ్ భోంచేసి వెళ్లిపో. నేను సాయంత్రం వస్తాను.''అంది మమ్మీ.

''ఎందుకు?''

''ఈనెక్లెస్ మాఫ్రెండ్స్‌కి బాగానచ్చిందట.

కంసాలికోసం కబురంపారు. ఆలశ్యమవుతుంది'' ఆవిడ మాటలకి మరోరోజయితే మండిపడేవాడ్నిగాని 'రాజీ' గుర్తొచ్చి,'లేదు మమ్మీ నేనూ నీతోనే వుంటా!

ఇంటికెళ్లిమాత్రమేసేపనేముంది?'అన్నాను. సాయంత్రం దాకా ఎక్కడుంటావిక్కడ?అని ''జానీ!''అని పిల్చింది మమ్మీ ఆడవాళ్లగుంపు వేపు చూస్తూ ఆహా! ఏమి నాఅదృష్టం? రాజీ లాంటి మరో అందమైన జానీ!

ఈ ఇద్దర్లో ఎవరితోనో ఒకర్తో సాయంత్రం లోగా స్నేహం పెంచేసుకోవాలి.

నాఊహల్ని తారు మారు చేస్తూ వచ్చిందో నలభై ఏళ్ల ఆంటీ.

''మావాడు కాస్సేపు రెస్ట్ తీసుకుంటాడు. ఎక్కడయినా ఓ బెడ్...''

''ఎక్కడో ఎందుకూ? పక్కనేగా మాయిల్లు?'' అని ముందు భోజనం కానియ్ బాబూ! నేనొచ్చి తీసుకెళ్తాను అని మమ్మీతో కలిసి వెళ్లిపోయింది.



''ఓహో!జానీ... నన్నూ నారాజీని విడదీయాలనుకుంటున్నావా? ఇంపాజిబుల్! నేను మీ ఇంటికి నీవెంట రాను...హ హ! వికటంగా నవ్వబోయి ఆగిపోయాను.

''ఏమిటి?మీలోమీరే మాట్లాడేసుకుంటున్నారు?'' అంటూ వచ్చిన రాజీని చూసి నవ్వాను.

రాజీ చేతిలో ప్లేటు, అందులో కొద్దిగా అన్నం రెండుగుత్తి వంకాయలు . రాజీకి గుత్తి వంకాయలంటే ఇష్టమేమోననుకొని హడావుడిగా నేనూ రెండు వడ్డించుకున్నాను.

''మీపేరు...?'' అడిగాను.

''రజిత. రాజీ అంటారు''

''లవ్లీ! బట్ , రాజీ అనడమే బావోలేదండీ. రాజీ అంటే ఏ రాజేశ్వరో ,రాజ్యలక్ష్మో అనుకున్నాను''

''మరి షార్టు కట్ ఎలా చేస్తే బావుంటుంది?''

''రజి!..ఛ!ఛ! బాలేదు. జిత... కాదు. రత.. ఛ!జిర!..రాజీ నవ్వేస్తూ.

''అలా ఎలానూ బావుండదనే రాజీ అంటారు.''అంది.

''కరెక్టే! మీరేం చేస్తున్నారు?'' ఆమె వెళ్లేలోగా వివరాలన్నీ సేకరించేయ్యాలని నా ప్రయత్నం.

''యమ్.యస్సీ ఫైనల్. మరిమీరు?''

''ఎంబిఏ పూర్తికాగానే, మా కంపెనీలోనే యం.డి నయ్యాను. ప్రసాద్ అండ్ కంపెనీ వినేవుంటారు.

పోతే,నాపేరు అడిగారుకాదు''

''ప్రవీణ్....''

''అరె ఎలా తెలుసుకున్నారు?'' ఆశ్చర్యంగా అడిగాను.

''మీ కర్చీఫ్ చెప్పింది'' అంది నవ్వుతూ.

''ఓ!''అంటూ నవ్వేశాను. మమ్మీ కర్చీఫ్స్ అన్నిటి మీద రంగురంగు దారాల్తో పేరుకుట్టింది' మొత్తం పేరు కుట్టినందుకు తను పోట్లాడాడుకూడా.

''మీతో వచ్చింది మీ మమ్మీకదూ!''

''హమ్మయ్య...మీరైనా మమ్మీని మా మమ్మీగా గుర్తించారు''అన్నాను దిగులుగా.

''ఆవిడకి మీ అంతపెద్దకొడుకున్నాడంటే ఎవరూనమ్మరు సుమండీ!''

''అవును''బాధగా అన్నాను. అందుకేనేమో....నూనెలవీ తినద్దంటుంది మమ్మీ.

రాజీ ప్లేటులో వదిలేసిన వంకాయలు చూసి, ''అదేం..కూరంతా వదిలేశారు?''అన్నాను ఆశ్చర్యంగా. ''వంకాయకీ,నాకూ ఆమడ దూరం. మా ఫ్రెండ్ మర్చిపోయినా ప్లేట్లో వడ్డించింది''అంది.

రాజీ కిష్టమనుకొని ఆకూరంతా రవ్వంత లేకుండా తినేసిన నన్ను నేనే తిట్టుకున్నాను.

ఇద్దరం చేతులుకడుక్కొచ్చాం.

''మీరు కాస్సేపు రెస్ట్ తీసుకుంటారా?''

''నో!నో! అవసరం లేదు''అన్నాను రాజీ ఇచ్చిన కిళ్లీనమిలేస్తూ.మా జానాంటీ వాళ్ల ఇల్లుపక్కనే మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లమని చెప్పింది.''

''అంటె మీరూ నావెంట వస్తారా?'' అడిగానుగబగబా.''మరి?''

''ఓకే ఓకే! పదండి'' అంటూ ఆమెని వెంబడించాను.

పెళ్లిపందిట్లో కన్పించిన చాలామంది జానాంటీ వాళ్లఇంట్లో కారమ్స్, కార్డ్స్, చెస్ ఆడుతూ కుర్చున్నారు. ఇంకొందరు నేలమీదే నిద్రకొరుగుతున్నారు. రాజీ నన్ను మేడమీదకి తీసుకెళ్లింది.

అక్కడ వరుసగా మూడు బెడ్‌రూంస్ వున్నాయ్.

ఓ గది తలుపు తిస్తూ ''ఈ రూంలో రెస్ట్‌తీసుకోండి'' అంది.


''మరి మీరు?''

''నాకు చాలా పనులున్నాయి. నేను బయట్నుంచిలాక్ చేసుకొని వెళ్తాను. ఇంకేవ్వరూ మిమ్మల్ని డిస్టర్బ్‌చెయ్యరు.''

''ఎందుకు?'' అంటే...నన్ను ఒంటరిగా గదిలోబంధించేస్తున్నావా రాజీ!

నాముఖంలోని భావాలు మరోలా అర్థం చేసుకున్న రాజీ''అటాచ్‌డ్ బాత్రూముంది. ఫర్వాలేదు'' అని బయట్నుంచి తాళం వేసి వెళ్లిపోయింది.

హతోస్మి రాజీ పక్కన కూర్చుని కబుర్లు చెబుతుందేమోనని ఎంత ఆశపడ్డాను?



## కొండ

ఏపుగా అందంగా
పెరిగి
క్రూరమైన
గొడ్డలి పెట్టు(బడు)లకు
లొంగే చెట్టును కాను
అందంగా
సువాసనలు
అన్నిదిక్కులా వెదజల్లి
ఆఖరికి
విచక్షణా జ్ఞానంలేని
కామాంధునిచేతిలో
క్రూరంగా కమిలిపోయే
పూవును కాను...

అందరి క్షేమం కోసం
నా రత్నమయ
శరీరాన్ని సైతం కోసుకున్నా
చలించని శిలని
స్థితప్రజ్ఞుణ్ణి
స్థిరచిత్తుణ్ణి

ఇంత డబ్బుండీ, అందముండీ , ఏఒక్క అమ్మాయినీ ఆకర్షించలేకపోవడం నిజంగా తన దురదృష్టం.

సంవత్సరం క్రితంఇలాగేఓ పెళ్లిలో"సరోజ" తో పరిచయమయింది.

చాలా సరదాగా మాట్లాడి, ఎవరూ చూడకుండా ఓముద్దుకూడా ఇచ్చింది.

మమ్మీతోచెప్పి ఆఅమ్మాయిని పెళ్లిచేసుకుందామని అనుకున్నాడు.

మర్నాడు ఫోన్‌చేసి సినిమాకి రమ్మని ఆహ్వానించింది. సినిమా చూశాక హోటల్ కెళ్లి ఐస్‌క్రీం తినేటప్పుడు రెండువేలు అప్పుగా కావాలని అడిగింది.

"రెండువేలేమిటి? నాడబ్బంతా నీది కాదూ!"అనేశాను.

"మనియార్డర్ రావడం లేటయిందీ... అందుకే ."అంది బాధపడుతూ.

హాస్టల్లో వుంటోంది కాబోలనుకొని , కార్లో వున్న చెక్ బుక్ తీసి రెండువేలకి చెక్‌రాసిచ్చాను.

"బజార్‌లో కొంచెం పనుంది. అవుతారా?" అనడిగింది.కారాపి మళ్లీ ఎప్పుడుకలవడం? ఆత్రంగా అడిగాను.

"అమెరికానుంచి డబ్బురాగానే తెచ్చి ఇస్తాను.మరోలా అనుకోరుకదూ! అంది.

"మీ పేరెంట్స్ అమెరికాలో వున్నారా?"

"లేదు మావారున్నారు."

నెత్తిమీద పిడుగు పడినట్లయింది నాకు. ఆవిడకాళ్లకి వెండి మట్టెలు చూసి కూడా ఏదో ఫాషన్‌కి పెట్టుకుందనుకున్నాను.

అన్నట్టుగానే సరోజ వారంరోజుల్లో డబ్బు తెచ్చి ఇచ్చి

"థాంక్యూ డార్లింగ్!" అంటూ మళ్లీ ముద్దివ్వబోయింది. కంగారుగా తప్పించుకున్న నన్ను ఓ పసి పిల్లాడ్ని చూసినట్టుగా చూసి నవ్వివెళ్లిపోయింది.

ఆ అనుభవంతో అసలు పెళ్లిళ్లకీ, పార్టీలకీ వెళ్లడం మానేసిన నాకు ఈరోజు 'రాజీ' తారసపడింది.రాజీక్కూడా పెళ్లయిందేమో! ప్చ్! అయుండదు. ఎలాగయినా రాజీని నా సొంతం చేసుకోవాలి......

"హలో ప్రవీణ్ గారూ! ఐదయ్యింది"చెవి దగ్గర రాజీ చిటికలేస్తూ లేపేసరికి ఉలిక్కిపడి లేచాను.

చిలకాకు పచ్చరంగు చీరలో రాజీవుదయం కంటే ఆకర్షణీయంగా కన్పించింది.

"ముఖం కడుక్కోండి." అంది లేచాను.

ఆమె అందించిన ఇస్త్రీటవల్‌తో ముఖం తుడుచుకుంటూ " మీరుచాలా శ్రమ తీసుకుంటున్నారు."అన్నాను. నావైపు అదోలా చూసి గోళ్లకున్న పెయింట్ శ్రద్ధగా చూసుకోసాగింది.

తలదువ్వుకొని, జేబులోంచి నా విజిటింగ్ కార్డ్ తీసి ఆమెకిస్తూ

"మీకు తీరికున్నప్పుడు తప్పకుండా వస్తారు కదూ!"అన్నాను.

"ఊ"


ఎందుకో రాజీని, ఆగదినీ వదలి బయటికి వెళ్లాలన్పించడం లేదు. రాజీకూడా అలాగే ఫీలయినట్టనిపించింది.

బయట్నుంచెవరో రాజీని పిల్చేసరికి

"వస్తానండీ !మీరుమేరేజ్ హాల్ కెళ్లండి" అనేసి వెళ్లిపోయింది.ఉస్సురంటూ కిందకి దిగుతోంటేమెట్లమీద ఎదురయింది మమ్మీ. అప్పుడే వేసుకున్న మేకప్‌తో ఫ్రెష్‌గావుంది మమ్మీ.

"నీకోసమే వస్తున్నాను.పద..." అంటూ నాతోమేరేజ్ హాల్‌కి నడిచింది మమ్మీ.

పెళ్లికూతురికి తుది మెరుగులు దిద్దుతోన్న రాజీ నన్ను చూసి సన్నగా నవ్వింది.




"మమ్మీ మీతో ఓమాట చెప్పాలి" అన్నాను.

"ఏమిట్రా!?"

"నాకో అమ్మాయి నచ్చింది."

"నిజం? ఎక్కడుంది?" అంది చుట్టూ చూస్తూ, తీరాచూస్తే రాజీ అక్కడ్నుంచి వెళ్లిపోయినట్టుంది.

"తర్వాత చూపిస్తాను. ఇప్పుడిక్కడలేదు" సరేలే ఇక్కడేకూర్చో వస్తాను అని మమ్మీ వెళ్లిందెటో. పెళ్లికూతుర్నీ, పెళ్లి కొడుకునీ వివిధ కోణాల్లోంచి ఫొటోలు తీస్తు న్నారు. వీడియో కెమెరాకూడా పన్జేస్తోంది.

మధ్యమధ్యలో రాజీతో కళ్ళు కలుపుతూనే వున్నాను.

"లేకన్నా. అప్పగింతలయేసరికి ఆలస్యమయేలా వుంది. ఎయిర్‌పోర్ట్ కెళదాం" అంది మమ్మీవచ్చి పరధ్యానంగావున్న నేను "ఎందుకు?"అన్నాను.

"ఎందుకేమిటి? ఏడుగంటల ఫ్లయిట్‌కి డాడీ రావడంలేదూ."

"అవునుకదూ" అంటూ లేచి మమ్మీతో పాటు కారుదగ్గరకి నడిచాను.

రాజీకెలా చెప్పాలో అర్థంకాలేదు. పదిమంది మధ్య నిలబడున్న రాజీ ఎలా చూసిందో మేం వెళ్లడం కరుకి కొద్ది దూరంలో వచ్చి నిలబడింది.

అంతలో,ఓ నలభైఐదేళ్ల వయస్కురాలు పరధ్యానంగా నిలబడ్డ రాజీ రెక్కపట్టుకొని మాదగ్గరకితీసుకొచ్చింది.

ఆహా ఏమి నాభాగ్యం? నా ప్రమేయం లేకుండానే రాజీనెవరో మమ్మీకి పరిచయం చేస్తున్నారు.

"మమ్మీ నావేపు చూస్తూ"

"ఈ విడ మీనాక్షాంటీరా. ఈ అమ్మాయి ఆంటీ కూతురు"అని పేరేమిటి? అంది రాజీని చూస్తూ.

"చెప్పింది రాజీ.

"నీకు చెల్లెలి వరసవుతుందినాన్నా" అంది మమ్మీ. అంతే రాజీ అక్కడ్నుంచి క్షణంలో మాయమయ్యింది.

మీనాక్షాంటీ మమ్మీకి చెప్పి వెళ్లిపోయింది.

మమ్మీ కార్లో కూర్చుంటూ

"నీకెవరో నచ్చారన్నావ్‌గా!చూపించవా?" అంది.

"లేదు మమ్మీ జోక్‌చేశాను"అన్నాను.

"బ్లడీ బీరకాయపీచు చుట్టరికాలు" కసిగా ఏక్సిలేటర్ నొక్కాను.